క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని అంటిపేట పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన కొట్యాడ నరసింహులు అలియాస్ నరసింహమూర్తి విజయ నగరంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన కుమారుడు శివకృష్ణకు నాగుల చవితిరోజున అంటిపేట గ్రామంలో అవమానం జరిగిందన్న విషయం తెలుసుకున్న నరసింహమూర్తి మనస్తాపంతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న గడ్డిమందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు విజయనగరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు శివకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం. రాజేష్ తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు తోణాం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సాలూరు రూరల్: ఇటీవల విజయనగరంలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్ 14 వాలీబాల్ విభాగంలో సాలూరు మండలం తోణాం ఆశ్రమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు సాయి వినోద్, వెంకటరావులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.సింహాచలం శుక్రవారం తెలిపారు. ఈ నెల 9న విజయనగరం జిల్లా భోగాపురం జెడ్పీహెచ్ పాఠశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొననున్నట్లు ఆయన చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఏటీడబ్ల్యూఓ కె.శ్రీనివాసరావు, వార్డెన్ లచ్చయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచన విరమించుకోవాలి



ఏడీఈకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచనను విరమించుకోవాలని నియోజకవర్గం కాంగ్రెస్ కోఆర్డినేటర్ బత్తిన మోహన్ అన్నారు. ఈ మేరకు స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఏడీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలకే ప్రజలపై విద్యుత్ భారాన్ని వేయడానికి పూనుకుందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అడ్డాకుల చిన్నారావు, గేదెల రామకృష్ణ, సిగడాపు బంగారయ్య, తీళ్ల గౌరీశంకర్, రేసు రాము, బోను శంకరరావు, అల్లు రామినాయుడు, గుత్తావల్లి దిలీప్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు తీసుకోం...

- ఎండీఎం వాహనాన్ని అడ్డుకున్న ఆరో వార్డు మహిళలు

వీరఘట్టం: ఈ నెల రేషన్ సరుకులు తీసుకోమని ఆరో వార్డు పరిధిలోని గెంబలివీధి వాసులు స్పష్టం చేశారు. ప్రభుత్వం బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార ఇస్తున్నామని చెబుతుంటే, ఎండీఎం ఆపరేటర్ మాత్రం కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారని మండిపడ్డారు. దీంతో శుక్రవారం వాహనాన్ని అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే డీలర్ తనకు ఇవ్వని సరుకులు ఎలా ఇవ్వగలనని ఎండీఎం ఆపరేటర్ ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే డీలర్‌ను పిలిపిస్తే, తాము మాట్లాడతామని మహిళలు పట్టుబట్టారు. విషయం తెలిసిన వెంటనే రేషన్ డీలర్ సంఘటనా స్థలానికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. కందిపప్పు స్టాకు వచ్చిందని, అయితే తన వేలిముద్ర పడకపోవడంతో ఇవ్వలేకపోతున్నామని చెప్పాడు. ప్రస్తుతం బియ్యం తీసుకుంటే, సోమవారానికి కందిపప్పు ఇస్తామని చెప్పినా మహిళలు శాంతించలేదు. దీంతో ఎండీఎం వాహనంతో డీలర్, ఆపరేటర్ తిరుగుముఖం పట్టారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

భామిని: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం మెరుగుపడుతుందని ఎంపీడీఓ గుండేలా చంద్రరావు అన్నారు. మండలంలోని ఘనసరలో సర్పంచ్ కమలా ఫాల్గుణరావు, కార్యదర్శి జగన్నాథంతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ట్యాంక్‌ల వద్ద పరిశుభ్రత పాటించాలని సూచించారు. చెత్తసేకరణ కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సహాయకుడు బిడ్డిక మోహనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పాతపుస్తకాలే

- వాటితోనే చిన్నారులకు బోధన
- గత ప్రభుత్వంలో ప్రారంభంలోనే కొత్త పుస్తకాలు
- ప్రస్తుతం పట్టించుకోని కూటమి ప్రభుత్వం

బలిజిపేట:

అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే చిన్నారులకు గత ప్రభుత్వం హయాంలో ఏటా కొత్త పుస్తకాలు కచ్చితంగా సరఫరా జరిగేవి. ఈ సంవత్సరం ఇప్పటికీ కొత్త పుస్తకాలు రాకపోవడంతో పాత పుస్తకాలతోనే కేంద్రాల్లో కార్యకర్తలు, చిన్నారులు కాలక్షేపం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు ఆంగ్ల మాధ్యమంలో చిన్నారులు పట్టు సాధించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విప్లవాత్మక మార్పులు చేశారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన నాలుగు పుస్తకాలు, కిట్లను అందించారు. రెండు నుంచి నాలుగేళ్లలోపు చిన్నారులకు ఇంగ్లీషు, గణితం, స్పోకెన్ ఇంగ్లీష్, యాక్టివిటీ డ్రాయింగ్‌కు సంబంధించి ఐదు పుస్తకాలు, ఒక పీపీ కిట్ అందించేవారు. నాలుగేళ్ల నుంచి ఐదేళ్ల చిన్నారులకు ఐదు పుస్తకాలతో కూడిన-2కిట్లు అందచేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రాలకు కొత్త పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తిగా నిలిపివేసింది.



పలగర కేంద్రంలో చదువుతున్న చిన్నారులు

మండలంలో సెక్టార్లు	కేంద్రాలు	ప్రీ స్కూల్ చిన్నారులు
అరసాడ	26	147 మంది
బలిజిపేట	24	201
గలావల్లి	22	197
పెదపెంకి	22	240

● కొత్తపుస్తకాలు రాకపోవడంతో..

కేంద్రాలకు కొత్త పుస్తకాలు రాకపోవడంతో పాత పుస్తకాలతోనే బోధన సాగిస్తున్నారు. చిన్నారులకు పాత, చిరిగిపోయిన పుస్తకాలలోనే బొమ్మలను చూపించి విద్యాబోధన చేస్తున్నారు. విషయ పరిజ్ఞానం పొందాల్సిన చిన్నారులకు తగిన విధంగా ప్రభుత్వం ప్రోత్సాహం అందించకపోవడంతో వారి తల్లితండ్రుల్లో అసంతృప్తి కనిపిస్తోంది. చిన్నారుల భవితకు అవరోధం కలుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాలపై ప్రజలలో అసంతృప్తి వెల్లువెత్తుతోంది. ప్రభుత్వం వారికి పుస్తకాలు పంపిణీ చేయకపోవడంతో చిన్నారులకు ఏం చెప్పాలా అనేది కార్యకర్తలకు ప్రశ్నార్థకంగా మిగిలింది. కొన్ని కేంద్రాల్లో పాతపుస్తకాలు సక్రమంగా లేకపోవడంతో చిన్నారులు కేంద్రాలకు ఎందుకు వస్తున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై వెంటనే ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త పుస్తకాలు సరఫరా చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పుస్తకాలు తర్వలో వస్తాయి:

అంగన్‌వాడీ కేంద్రాలకు పుస్తకాలు త్వరలో వస్తాయి. ప్రస్తుతం కేంద్రాల వద్ద ఉండే పుస్తకాలతోనే చిన్నారులతో చదివించడం, రాయించడం చేయిస్తున్నాం. బోధనకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నాం.

– ఎస్.సులేఖ, సీడీపీఓ(ఎఫ్ఏసీ), బలిజిపేట ప్రాజెక్టు

యోగాతో ఆరోగ్యపరిరక్షణ

బలిజిపేట: భారతీయ వైద్యవిధానం, ఆహారపు అలవాట్లు, యోగా వంటివి చాలా ఉపయోగకరమైనవని పార్వతీపురం మన్యం జిల్లా హాస్పిటల్ వైద్యాధికారిణి సుశీల తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని గలావల్లి పీహెచ్‌సీలో ఆశ వర్కర్లకు జాతీయ ఆయుష్‌కమిషన్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్ ద్వారా ఆరోగ్యాన్ని ఏవిధంగా సంరక్షించుకోవచ్చో వివరంగా తెలిపారు. ఆయుష్ వైద్య విధానాలు, ఆరోగ్య జీవనం కోసం ఎటువంటి సాధనాలు చేయాలి, యోగా, హోమియో వైద్యాల వల్ల ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాసరావు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



గలావల్లి పీహెచ్‌సీలో పోస్టర్లను విడుదల చేసిన వైద్యాధికారిణి సుశీల, వైద్యాధికారి శ్రీనివాసరావు

మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి



పాఠశాలలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ
- గుచ్చిమి గ్రామ సందర్శన

సీతానగరం: మండలంలోని అధికారులు ప్రజలకు మౌలిక సదుపాయాలపై ప్రత్యేకదృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ఈ మేరకు మండలంలోని గుచ్చిమి గ్రామాన్ని శుక్రవారం ఆయన మండల అధికారులతో కలిసి సందర్శించి ప్రజల సమస్యలపై విషయ సేకరణ చేశారు. గ్రామాన్ని సందర్శించిన ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ ముందుగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, గర్భిణులు, బాలింతల యోగ క్షేమాలను అడిగితెలుసుకున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలలోఉపాధ్యాయులు నిర్వహిస్తున్న తరగతులను పరిశీలించారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తరగతి గదుల్లో వనరులు, మంచినీటి పథకం ట్యాంక్, పైప్‌లైన్ల గురించి తెలుసుకున్నారు. మండలంలో కొత్తగా నిర్మిస్తున్న మూడో రెల్వేలైన్‌తో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి సచివాలయ ఉద్యోగులంతా ప్రజలకు అందుబాటులోఉంటూ మెరుగైన సేవలందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ త్రివిక్రమ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్, ఏఓ ఎస్.అవినాష్, స్థానిక సర్పంచ్ ఎం. శ్రీదేవి, మాజీ సర్పంచ్ ధనుంజయనాయుడు, ఉపసర్పంచ్ వెంకటరమణ, ఐసీడీఎస్ ఎస్ఓ పూర్ణిమ, వెలుగు, ఉపాధిహామీ, పశువైద్యాశాఖ మండల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో రాష్ట్రస్థూల ఉత్పత్తిపై గణాంకాలు

- సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ

సీతానగరం: పంటకోత ప్రయోగాలద్వారా వచ్చే దిగుబడి ఆధారంగా వ్యవసాయరంగంలో రాష్ట్రం స్థూల రాష్ట్ర ఉత్పత్తి(జీడీపీ) ఉంటుందని సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని రంగంపేటలో డివిజినల్ గణాంకశాఖ అధికారి జయప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం వరిలో 5 ఇంటు 5 విస్తీర్ణంలో నిర్వహించిన పంటకోత ప్రయోగాన్ని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ పరిశీలించారు. ప్రయోగంలో ధాన్యం దిగుబడి 14.480 కేజీలు వచ్చింది. సందర్శన అనంతరం ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ సీతానగరం మండలం లో 128 పంటకోత ప్రయోగాలు చేయాలని నిర్ధారించగా జిల్లావ్యాప్తంగా 1768 పంటకోత ప్రయోగాలు నిర్వహించనున్నామన్నారు. ప్రతి 100 హెక్టార్ల పరిధిలో పంట విస్తీర్ణాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని 4 పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తారన్నారు. ఒక యూనిట్‌లోకి వచ్చిన దిగుబడి ఆధారంగా పంట ఇన్సూరెన్స్, ధాన్యం కొనుగోలు నిర్ణయించనున్నట్లు తెలిపారు. పంట కోత ప్రయోగాలద్వారా వచ్చే దిగుబడి ఆధారంగా వ్యవసాయరంగంలో రాష్ట్రం స్థూల రాష్ట్ర ఉత్పత్తి(జీడీపీ)ని సబ్‌కలెక్టర్ తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమామహేశ్వరరావు,గణాంక అధికారి కె జయప్రకాష్, ఏఓ ఎస్.అవినాష్, మండలగణాంక అధికారి సతీష్, గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

పాచిపెంట: మండలంలో గరేళ్లవలస గ్రామానికి చెందిన సూకురు అప్పలస్వామి చికిత్స పొందుతూ మృతిచెందాడు.కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో తీవ్రమనస్తాపానికి గురైన అప్పలస్వామి గత నెల 31న ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు గమనించి సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు విజయనగరం ఆస్పత్రికి రిఫర్ చేశారు. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శ్యామ్ తెలిపారు.

ఆరోగ్య సిబ్బంది నియామకమెప్పుడు?

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో ఆరోగ్య సిబ్బంది నియామకం ఎప్పుడని గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు పల్ల సురేష్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన కురుపాం మండల కేంద్రంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. పారపపురం, సీతంపేట, పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరిజన పాఠశాలల విద్యార్థులు తరచూ మృత్యువాత పడుతున్నా ఆరోగ్య సిబ్బందిని నియమించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేయకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఆరోగ్య సిబ్బంది నియామకాలు చేపడతామన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చేసిన మొదటి సంతకం ఏమైందని ప్రశ్నించారు. లెక్కల్లోకి రాని విద్యార్థుల మరణాలు కూడా ఉన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

మత రాజకీయాలను తరిమికొట్టాలి

- సీపీఐ ఎంఎల్ లిబరేషన్ డిమాండ్

పాలకొండ రూరల్: తెలుగు గడ్డ పైనుంచి మత రాజకీయాలను తరిమికొట్టాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.బంగారావు, జిల్లా కమిటీ సభ్యుడు పి.భాస్కరరావు డిమాండ్ చేశారు. పాలకొండ, వీరఘట్టాం మండలాల్లో శుక్రవారం విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. సంఘ నాయకుడు శంకరరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేటు శక్తులకు కొమ్ముకాస్తున్నాయని ఆరోపించారు. మారుమూల పల్లెల్లోకి మత రాజకీయాలు చొప్పిస్తున్న బీజేపీకి టీడీపీ, జనసేన వంత పాడుతున్నాయని మండిపడ్డారు. డిసెంబర్ 4న విజయవాడలో నిర్వహించనున్న ప్రజాహక్కుల సభలో ఈ అంశంపై చర్చిస్తామన్నారు.

సుందర పార్వతీపురానికి సహకరించండి



పట్టణ అభివృద్ధిపై సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: పార్వతీపురం పట్టణాన్ని స్వచ్ఛ సుందరంగా తీర్చిదిద్దేందుకు వ్యాపార సంస్థలు, దాతలు ముందుకు రావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ వ్యాపార సంస్థలు, సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి వాతావరణం ఉన్న జిల్లా పార్వతీపురం అని, ఈ ప్రాంతం ప్రశాంతతకు మారుపేరుగా ఉందని, ఈప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకుంటే మరింత ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. దానిని నిలుపుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందన్నారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాల వారు ముందుకు రావాలని కోరారు. ఒక్కో సంస్థ ఒక్కో ప్రాంతాన్ని దత్తత తీసుకుని ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారుల మరమ్మతుల వంటివి ప్రభుత్వం తరఫున చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పార్కుల అభివృద్ధి, ముఖ్య కూడళ్ల అభివృద్ధిని వివిధ సంస్థలు చేపట్టాలని కోరారు.

వాటర్ ఫౌంటైన్‌తో కూడిన సెల్ఫీ పాయింట్, హోటల్స్, శ్మశాన వాటికల అభివృద్ధికి ఆలోచన చేయాలని సూచించారు. ఈ ప్రాంతాన్ని సందర్శించే వారికి మంచి అభిప్రాయం కలిగేలా పట్టణాన్ని తీర్చిదిద్దాలని కలెక్టర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. పట్టణాభివృద్ధికి సంబంధించిన అంశాలపై అందరూ దృష్టిసారించి అభివృద్ధికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసరాజు, వివిధ సంఘాల ప్రతినిధులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి

పార్వతీపురంటౌన్: తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సుందరయ్య భవనంలో రైతులతో శుక్రవారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం గత వారం రోజులుగా మార్కెట్లోకి వస్తున్నాయని. ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. ధాన్యం కొనుగోలు చేస్తామన్న భరోసాను సైతం ప్రభుత్వం కల్పించలేదన్నారు. జిల్లాలో ఉన్న 57 వేల మంది రైతులు ప్రభుత్వం నుంచి ఎటువంటి భరోసా లేకపోవడం వల్ల చౌకగా

భారీ ఉద్యమం చేపడతాం

రైతుల పట్ల ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందని తక్షణమే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లయితే జిల్లావ్యాప్తంగా రైతులతో భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రతి రైతు భరోసా కేంద్రాన్ని, గ్రామ సచివాలయాలను ముట్టడించి ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి

కోదండ రామాలయ నిర్మాణానికి శ్రీకారం

పాలకొండ రూరల్: స్థానిక యాలాం కూడలి వద్ద కోదండ రామాలయ నిర్మాణానికి శుక్రవారం తొలి అడుగు పడింది. పల్లా కొండలరావు దంపతులు భూమిపూజ చేపట్టారు. స్థానికుల కోరిక మేరకు ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు కొండలరావు చెప్పారు. వేద పండితుడు బంకుపల్లి చిట్టిబాబు నేతృత్వంలో సంప్రదాయబద్ధంగా స్థానికులతో కలిసి భూమిపూజ చేశారు. అలాగే అగ్నిమాపక కేంద్రం సమీపంలోని గారమ్మ మందిరం వద్ద మండప నిర్మాణానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోషకుమార్ దంపతులు రూ.25వేలు వితరణగా అందించారు.

ఔషధ మొక్కలు పెంచాలి



ఔషధ మొక్కల ఉపయోగంపై అవగాహన కల్పిస్తున్న జట్టు ట్రస్టీ పారినాయుడు

గరుగుబిల్లి: ప్రతిఒక్కరూ ఔషధ మొక్కలు పెంచాలని జట్టు ట్రస్టీ డి.పారినాయుడు సూచించారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయ ఆవరణలో కురుపాం మండలంలోని మొండెంఖల్, ఉరిడి గ్రామ పంచాయతీల పరిధిలోని 55 మంది మహిళా రైతులకు మూలికా వైద్యంపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో అపారమైన సహజ వనరులున్నాయని, వాటిలో ఔషధ మొక్కలు కూడా ఉన్నాయన్నారు. ప్రకృతి లభించే ఎన్నో ఔషధ మొక్కలు ఎన్నో రకాల రోగాలకు ఉపశమనం కలిగించే మందుగా ఉపయోగపడుతున్నాయన్నారు. అనంతరం ఔషధ మొక్కల సాగును పరిశీలించారు. కార్యక్రమంలో మూలికా వైద్య నిపుణుడు టి.శివకేశ్వరరావు, రైస్ ఫారెస్ట్ థిమెటిక్ కో-ఆర్డినేటర్ ఎ.శిరీష, క్లస్టర్ కో-ఆర్డినేటర్ ఎం.మణికుమార్, జట్టు ట్రస్ట్ కో-ఆర్డినేటర్ ఎం.నూకంనాయుడు పాల్గొన్నారు.

వలంటీర్ల సదస్సును భగ్నం చేసే ప్రయత్నాలు మానుకోవాలి

సాలూరు:

విజయవాడలో వలంటీర్లు నిర్వహించనున్న సదస్సును భగ్నం చేసే ప్రయత్నాలు మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు బలగ రాధ అన్నారు. వలంటీర్లకు కూటమి నేతలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడ సదస్సుకు వలంటీర్లు, నాయకులు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆమెను పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువచేయడంలో కీలకపాత్ర పోషించిన వలంటీర్లను నిర్దాక్ష్యణ్యంగా తొలగించడం అన్యాయమన్నారు. టీడీపీ కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు ఉద్యోగావకాశాలు కల్పించి,కనీస వేతనం 10 వేల రుపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, వలంటీర్లకు న్యాయం జరిగే వరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.



బి.రాధను హౌస్ అరెస్ట్ చేస్తున్న పోలీసులు

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించాలి

పార్వతీపురంటౌన్:

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అఖిల్ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సుందరయ్య భవనంలో సమావేశం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీడీఏల పరిధిలో గల వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండకపోవడం వల్ల పర్యవేక్షణ కరువైందన్నారు. అధికారులకు సరిపడా నిధులు మంజూరు కాకపోవడం, అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయకపోవడం వల్ల ఇలాంటి సంఘటనలు ఏర్పడుతున్నాయన్నారు. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు. గిరిజన పాంతాల్లో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన శాఖ మంత్రి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, హెచ్.సింహాచలం, పి.వెంకీ, డి.గౌరేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అఖిల్

చట్టాలపై అవగాహన అవసరం

గరుగుబిల్లి: మహిళలంతా తమకు రక్షణకు కల్పించే చట్టాలపై అవగాహన కలిగి ఉండడం అవసరమని సీనియర్ న్యాయవాది టి.జోగారావు అన్నారు. మండలంలోని గొట్టివలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, బాల్యవివాహాలు, గృహహింస, మహిళలపై అఘాయిత్యాలను వ్యతిరేకించే చట్టాలను వివరించారు. 18 ఏళ్ల వయసు లోపు ఆడపిల్లలకు పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరమని, అటువంటి వివాహాన్ని ప్రోత్సహించిన వారిని కూడా నేరస్తులుగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. అలాగే మహిళలను గృహహింసకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహిళలంతా రక్షణ కోసం చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.చంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది జోగారావు